# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఘంటసాల రజతోత్సవం

### (విజయచిత్ర – 1970, ఫిబ్రవరి సంచిక నుంచి)




గత యిరవై యేళ్ళలో, 1950 నుంచి 1970 వరకూ, కనీసం పది తెలుగు సినిమాలైనా చూసి వున్న వారికి ఘంటసాల పేరు తెలియకుండా వుండటం అసంభవం. ఈ రెండు దశాబ్దాలలో విడుదలైన కొన్ని వందల తెలుగు చిత్రాలలో ఘంటసాల పాట లేని చిత్రాలు పాతికకు తక్కువే వుంటాయంటే నమ్మటం సులభం. ఇన్నేళ్ళుగా ఘంటసాల పాడిన వేల పాటలలో చిత్రం విడుదలైనప్పుడు సగానికి పైగా ప్రజలకు నచ్చేవనీ, వాటిలో పదేళ్ళు దాటినా శ్రోతలకు విన వేడుక అనిపించే పాటలు యాభై పై చిలుకే వుంటాయనీ, అందులో దాదాపు పది పాటలు పండిత, పామర, సర్వజనరంజకంగా యెప్పటికీ వుండేవనీ అంటే అది అభినందన సమయంలో అందరూ చెప్పే అతిశయోక్తి కాదు. ఆది దేవుడైనా అధిక్షేపించలేని పరమ సత్యం.

ఇన్నేళ్ళుగా తెలుగు చిత్ర పరిశ్రమలో అంతర్భాగమై వుంటున్న ఘంటసాల గురించి ఏది వ్రాసినా చర్విత చర్వణమే అవుతుంది. కాబట్టి యిక్కడ వారి గురించి అందరికీ తెలిసిన విషయాల గురించి తక్కువగాను, అంతగా తెలియని విషయాల గురించి ఎక్కువగానూ తెలియజేస్తాను.

### నేపథ్య గాయకుడు

కీర్తిశేషులు సముద్రాల రాఘవాచార్యుల ప్రోత్సాహంతో మద్రాసు చేరుకొన్న ఘంటసాల మొట్ట మొదట చిన్న చిన్న వేషాలు వేశారు. బృందగానాలలో గొంతు కలిపారు. తానుగా పాటపాడే అవకాశం బి.ఎన్.రెడ్డి నిర్మించిన వాహినీ వారి "స్వర్గసీమ" (1945) లో కలిగింది. ఆ పాట

సి.హెచ్. నారాయణరావుకి నేపథ్యం "గాజుల పిల్ల" అనే నృత్య నాటికకు భానుమతితో పాడిన యుగళ గీతం. 'ఓ నా చిట్టి చిలకా ఎంతలసీ పోతివే అయ్యో' అన్నదీనాడు విన్నా, ఘంటసాల కంఠంలో 'కంచు'దనం కమ్మదనం ఆ నాటినుంచే కలసి వున్నాయన్న సంగతి తెలుస్తుంది.

ఆ నాటికే కొందరు నేపథ్య గాయకులు వున్నారు. కాని సినిమాలలో చాలా మట్టుకు పాటలు పాత్రధారులే పాడేవారు. ముఖ్య పాత్రధారుల పాటలన్నీ నేపథ్య కంఠాలలోనే వుండడం 1950 తర్వాత కాని జరగలేదు. ఆ సంవత్సరం విడుదలైన 'స్వప్న సుందరి' చిత్రం మధుర గీత మంజరిగా చూచిన వారి అభిమానాన్నీ, చూడని వారి అభిమానాన్నీ చూరగొన్నదనటం నిస్సంశయం. అమృతోపమేయమూ, అజరామరమూ అయిన ఆ సంగీతం సృజించింది కీర్తి శేషులు సి.ఆర్.సుబ్బరామన్. దీనితో ఘంటసాల నేపథ్య గాయకునిగా స్థిరపడినట్లే అని చెప్పుకోవాలి. ఆర్.బాలసరస్వతీదేవితో పాడిన యుగళ గీతాలు 'ఈ సీమ వెలసిన హాయీ', 'కానగనైతినిగా', తానే పాడిన 'సాగుమా సాహిణీ ఆగని వేగమే జీవితము' యీనాటికీ విన్నవారిపట్ల మలయానిల వీవనలు.

1951 లో విడుదలైన "మల్లీశ్వరి", దానికి రెండేళ్ళ తరవాత వచ్చిన "దేవదాసు" చిత్ర గాయకునిగా ఘంటసాల కెదురేలేదన్న విషయం ఋజువు పరిచాయి. నేపథ్య గాయకునిగా ఆనాడే ఘంటసాల సాధనా, ప్రతిష్టా పతాక స్థాయి నందుకున్నవని చెప్పుకోవచ్చు. ఆ తరువాత పాడిన పాటలతో అంతకు పైమెట్టు ఎక్కలేమా అంటే (జాను తెనుగుకూ జాతిఘనతకు శ్రీ మల్లాది రామ కృష్ణశాస్త్రీ, కర్ణాట, లలిత సంగీత శాస్త్రాలకు పెండ్యాలా మ్రోయించిన "జయభేరి" తక్క) దానికి కొంత కారణం బుద్బుద ప్రాయమైన కలగలపు సంగీతము, నానాటికీ క్షీణిస్తున్న ప్రజల అభిరుచీ, తన కంఠం పట్ల ఘంటసాల చూపిన నిరాదరణ, నిర్లక్ష్యమూ ! కంఠ మార్దవం దైవదత్తం. సాధన మానవ ప్రయత్న సాధ్యం. ఆ రెంటి కలయిక వలన సిద్ధించిన మధురస్వనాన్ని కఠోర నియమాలతో కాపాడుకోక పోవటమే ఘంటసాల చేసిన లోపం. ఇదే జరగకుండా వుంటే అసలు కొత్త గాయకులు ప్రవేశించటానికి అవకాశం కలిగేది కాదేమో!

## సంగీత దర్శకుడు

సినిమాల కోసం ఘంటసాల మొట్ట మొదట వరస చేసిన పాట "రత్నమాల" (1947)లో వినిపించింది. కీర్తి శేషులు సి.ఎస్.ఆర్. పాడిన 'ఆగవే మరదలా' అన్నదాపాట. ఆ చిత్రంలోనే మరికొన్ని పాటలు –('అందగాడ ఓబలేశా, దారి తెలియదాయె') తానే చేసినా, ఆ వరసల ఘనత తక్కిన పాటలు చేసిన సుబ్బరామన్ కే దక్కింది. అలానే 'బాలరాజు' (1948) లో నాలుగైదు పాటలు ('నవోదయం, తేలి చూడుము హాయీ' యిత్యాది) చేసినా, చిత్రంలో సహాయ సంగీత దర్శకునిగా వేసినా, ఆ చిత్రంలో అన్ని పాటలూ ఎస్.వరలక్ష్మి మృధు మధుర గానంతో బ్రహ్మాండంగా ప్రజాదరణ పొందినా, ఆ ఘనత కూడా అప్పటికే పేరు ప్రతిష్టలార్జించుకొన్న గాలిపెంచలకే దక్కింది. ఆ చిత్రంలో వీరిద్దరు చేసిన పాటలే కాక సుబ్బరామన్ వీ వుండటం ఒక విశేషం.

ఘంటసాల సంగీత దర్శకునిగా నియమించబడిన మొదటి చిత్రం మహతీ వారి 'లక్ష్మమ్మ'. నాలుగు కంపెనీలు మారి యీ చిత్రం 1950 లో విడుదల కాకమునుపే 'మనదేశం' 'కీలుగుర్రం' చిత్రాలు 1949 లో వచ్చాయి. 'లక్ష్మమ్మ' కోసం చేసిన వరసలు విన్న నాయిక పాత్రధారిణి, తన స్వంత చిత్రం 'మనదేశం' కోసం ఆయనను బుక్ చేయటం, ఆ పాటలు విన్న మీర్జాపురం రాజావారు 'కీలుగుర్రం' సంగీతపు కళ్ళెం ఘంటసాల చేతికివ్వటం జరిగింది. అంత విజయవంతంగా నడవని కారణాన 'లక్ష్మమ్మ' పాటలు యీనాడు ఎవ్వరికీ గుర్తులేవు. కాని 'మనదేశం' లో రెండు యుగళ గీతాలూ, కృష్ణవేణి, ఎం.ఎస్.రామారావు పాడిన 'ఎందుకో ఈ అనుబంధం' 'చలో చలో రాజా' ఆనాడు 'హిట్' గీతాలు. ఈ నాటికీ నిత్య నూతనత్వంతో తొణికిసలాడే యువగీతాలు. ఇక 'కీలుగుర్రం' లోని 'కాదుసుమా కల కాదు సుమా' ప్రజలనెలా వెర్రెక్కించిందో ఆనాటి ప్రేక్షకులకు తెలుసు. ఈ చిత్రంలోని 'అమ్మ గావుమమ్మ' 'దిక్కు తెలియదేమి సేతు' పాటలతోనే పి.లీల ప్రథమ శ్రేణి నేపథ్య గాయనిగా పదేళ్ళు నిలబడింది. ఇప్పుడు వింటే 'కాదు సుమా' కొంత పాత ఫక్కీలో వుంటుంది కాని, 'ఎంత కృపామతివే' 'తెలియవశమా' పాటలు, యెన్నో కొత్త పాటలకంటె మెత్తగా వుంటాయి. ఇప్పటికీ ఘంటసాల కచ్చేరీలలో పాడే తత్వం 'ఎవరు చేసిన ఖర్మ' ఆ చిత్రంలోనిదే !

విజయా వారి 'షావుకారు' (1950) సాంఘిక చిత్రాలలో యెప్పటికీ యెటువంటి ఉన్నత స్థాయినాక్రమించుకొని నిలవగలదో, అందులో వినిపించిన ఘంటసాల సంగీతమూ అలానే నిలవగలదు. 'ఇంతేనన్నా', 'మారిపోవురా కాలము' పాటలలో మాధవపెద్దికొక విశిష్ట స్థానం లభించింది. వాద్యానుసరణ వినీ వినబడకుండా నాయకుడు (ఘంటసాల) పాడిన 'ఏమనెనే చిన్నారి' యిప్పటికీ అద్వితీయం. కనకం పాడిన 'భలే దొరలకు' ఎప్పటికీ

పాత్రౌచితి గల పాటకు ఒక ప్రతీక. పతాక సన్నివేశంలో ఒక హరికథను నేపథ్య సంగీతంగా ఉపయోగించిన తీరు (దర్శకుడు:ఎల్.వి.ప్రసాద్) అనుపమానం. ఇలా ఆ చిత్రంలో సంగీతం గురించి యెంతయినా చెప్పుకు పోవచ్చు.

ఘంటసాల సంగీత దర్శకత్వం వహించిన మిగిలిన తొంభై చిత్రాలలో చెప్పుకోవలసినవి సాంఘికాలలో "చిరంజీవులు," జానపదాలలో "రహస్యం," పౌరాణికాలలో "దీపావళి." ఈ మూడు చిత్రాలెన్నటానికి కారణం వాటిల్లో దాదాపు అన్ని పాటలూ అందమైనవే కావటం; ప్రతి పాట స్వయం సృజనాత్మక శక్తికి తార్కాణాలు కావటం; వరసలూ, రచనా, సమయ శుద్ధి, సంధర్భోచితమూ కావటం. మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు "చిరంజీవు"ల్లో వ్రాసిన ప్రతి పాటా సాహిత్య లోకంలో సజీవంగా వుండేటట్లు ప్రాణ ప్రతిష్ట చేసిన ఘనత ఘంటసాలది. 'రహస్యం'లో గిరిజా కళ్యాణ యక్షగానంలోనే కాక, తక్కిన పాటలకూ మల్లాది గారు ఆదేశించిన రాగాలలోనే ప్రజారంజకమైన (విఖ్యాత కర్ణాటక సంగీత పండితులైన చిత్తూరు సుబ్రహ్మణ్యం పిళ్ళై గారు యీ చిత్రంలోని సంగీతాన్ని ఎంతైనా మెచ్చుకొన్నారు) వరుసలు యేర్పరచిన వినయమూ, విద్యా ఘంటసాలవి. "దీపావళి" చిత్రంలో సత్యభామ పాత్రను సాహిత్య రూపంగా 'సరియా నాతో' అంటూ కీర్తి శేషులు సముద్రాల చిత్రిస్తే దానికి సంగీతంతో సమగ్రరూపం దిద్దిన విన్నాణం ఘంటసాలది.

'ప్రయోగ శరణం వ్యాకరణం అన్నట్లు శ్రోత శ్శరణం సంగీతం ముఖ్యంగా చిత్ర సంగీతం డబ్బా పాటలూ, పాశ్చాత్య ధోరణులూ, హిందీ పాటల అనుకరణలూ, తమిళ గీతాల అనుసరణలూ యివన్నీ శ్రోతల అభిరుచిని ఆలంబనగా తీసికొని నిరంకుశ పరిపాలన చేస్తున్నప్పుడు అటువంటి సంగీతం ఘంటసాల మళ్ళీ వినిపించాలని కోరుకొనడం నేల విడిచి సంగీతం చేయమనడం.

ప్రఖ్యాత నిర్మాతల ఆదేశానుసారం హిందీ పాటలు మక్కీకి మక్కి అనుకరించిన ఘంటసాల __ యీనాటి క్షుద్ర సంగీతం __ అదే క్లబ్బు సంగీతం __ వినిపిస్తూ అందులోనే తగుమాత్రం అందాలు దొర్లిస్తున్న ఘంటసాల _ అవకాశం దొరికితే సద్వినియోగ పరచుకునే స్తోమత గల వ్యక్తి. నిజాన్ని తెలియని, తెలుసుకోలేని నిష్ఠాగరిష్టులు, ఘంటసాల అభిమానులే ఒక మాట అడగవచ్చు. అటువంటి పనులు ఘంటసాల చేయ నిరాకరించ కూడదా అని. బ్రతుకు తెరువుగాసుకోలేని మూర్ఖత్వం అతనిలో లేదు. నిర్మాతల ఆదేశానుసారం సంగీతం చెయ్యము అన్నవారు లేకపోలేదు. వారికి మొదట్లో ఆత్మాభిమానం మిగిలినా, కంట్రాక్టులు సన్నగిల్లి పోవడంతో అదీ వెచ్చింపబడక తప్పలేదు. ఇప్పుడు వాళ్ళకు రెండూ లేవు. నిర్మాతలను ఒక వంక మెప్పిస్తూ వుంటేనే పరిశ్రమలో నిలబడగలగటం. అలా వుంటేనే అడపాదడపా వచ్చిన సదవకాశాన్ని వినియోగ పరచుకోవడం. అలా జరిగితేనే గిరిజాకళ్యాణం వంటివి సిద్ధించటం.

## చిత్ర నిర్మాత

ఘంటసాల "పరోపకారం" (1953), "సొంతవూరు" (1956) "భక్తరఘునాధ్" (1960) అన్న మూడు చిత్రాలు స్వయంగా నిర్మించారు. ఘంటసాల పాడిన 'వలపుల కథకిది తొలిపలుకు' 'హృదయమా సాగిపొమ్మా' "పరోపకారం" లోనూ కృష్ణపరమైన 'వెన్నెల విరియునురా' 'మల్లెమొగ్గల్లార సిగ్గు బుగ్గల్లార' "సొంతవూరు" లోనూ జ్ఞాపకం చేసుకొనదగిన పాటలే అయినా సంగీత పరంగా ఉత్తమమైనది "భక్తరఘునాధ్" చిత్రమే. 'జయ మురళీ లోలా' అని కోమల పాడిన జావళి, 'నీ గుణ గానము' 'సంసారజలధి దాటించే నావ, గోపాల దయసేయరా' అన్న భజనలూ, 'కొండమీద సందమామ' అన్న పల్లె పాట ఆ చిత్రానికి స్వరాలంకరణలు. విజయం సంగతి ఎలా వున్నా యీ చిత్రం తీసినందుకే ప్రజలు హర్షించగలిగారు కాని, సంగీత దర్శకుడు నిర్మించడానికి ప్రత్యేక కారణం కనబడని మిగతా రెండు చిత్రాలనూ కాదు. ప్రస్తుత ప్రజాభిరుచి తెలిసిన ఘంటసాల, భవిష్యత్తులోనూ నిర్మాతగా వ్యవహరిస్తారని అనుకోవడానికి అవకాశం లేదు.

## ప్రైవేట్ రికార్డుల గాయకుడు

గత పాతికేళ్ళలో ఘంటసాల కనీసం అరవై పాటలకు పైగా ప్రైవేటు రికార్డులు యిచ్చి వుంటారు. కపిలవాయి రామనాధ శాస్త్రి తరువాత హిస్ మాస్టర్స్ వాయిస్ వారికి అంత లాభసాటి గాయకుడు ఘంటసాలే. తాను మొట్ట మొదట ఇచ్చిన రికార్డులో ఒక ప్రక్క, 'గాలిలో నా బ్రతుకు' అన్న పాట, మరోక ప్రక్క 'నగుమోమునకు' అన్న పద్యం. ఇది బాగానే చెల్లుబడి అయినా తదుపరి యిచ్చిన 'పుష్ప విలాపం' 'పుష్పాంజలి' (కరుణశ్రీ పద్యాలు) 'ఏడుకొండల స్వామీ', 'నమో వెంకటేశా' (రావుల పర్తి భద్రిరాజు రచనలు) అమ్ముడు పోయినట్లు (నా అంచనా, ఒక్కొక్కటి పది, పదిహేను వేలు) వేల సంఖ్యలో అమ్ముడు పోలేదు. ఇప్పటిదాకా యిచ్చిన పాటలలో జాతీయ గీతాలు (సరోజినీ దేవి, స్వాతంత్ర్య సిద్ధి) రాష్ట్రీయ గీతాలు (ఆంధ్ర రాష్ట్రం) శ్రీరామ,

వినాయక, వెంకటేశ్వర దేవరలపై స్తోత్రాలు, జానపద గీతాలు (సింత సిగురు చిన్నదాన, నీచేయి నా చేయి) ప్రేమ గీతాలు (తలనిండ పూదండ, వెలిగించవే చిన్ని వలపు దీపం) వున్నాయి. ఏనాడో "మన దేశం" చిత్రంలో స్త్రీ పాత్రధారులు పాడిన 'అత్తలేని కోడలు' 'పంచదారవంటి పోలీసెంకటసామి' తదుపరి ఘంటసాల కచేరీలలో పాడి ప్రజాదరణ సాధించగా, ఆ తరువాత ప్రైవేటు రికార్డుగా విడుదలైనది. ఇవన్నీ కాస్త పెద్ద మనిషి తరహా ఏంప్లి ఫైయర్ల వారికి, వారిని తెప్పించుకొనే వారికీ సుపరిచితాలే. ఇటీవలే తగ్గింపు ధరకు యీ పాటలు గల ఒక లాంగ్ ప్లేయింగ్ రికార్డు గ్రామఫోన్ కంపెనీవారు విడుదల చేశారు.

## పాటల రచయిత

ఘంటసాల గురించి చాలామందికి తెలియని విషయం యిదొక్కటే. రంగప్రవేశం చేసిన మొదటి కాలంలో దాదాపు పది పదిహేను పాటల దాకా ఘంటసాల వ్రాయడం జరిగింది. ఒకటి కొందరికి తెలిసినదే 'బహుదూరపు బాటసారీ' అన్నది. రికార్డుగా వచ్చి, యిప్పటికీ అమ్ముడు పోతున్నది. రాను రాను పనుల ఒత్తిడి వలన, తనకంటే బాగా వ్రాసే రచయితల పాటలు కొల్లలని గ్రహించే శక్తి ఘంటసాలలో వుండటం వలన వ్రాయటం మానుకొన్నారు. తక్కిన పాటలు రేడియో శ్రోతలకు పరిచితాలే. అందులో ఒక్కటి ఉదహరిస్తూ ముగిస్తాను. అది ఘంటసాలకు వర్తిస్తుంది ఆత్మ వర్ణనగా. ఘంటసాలకూ వర్తించాలి తన అభిమానుల ఆశంసగా

"సంసారమనే సాగరమందు
సంగీతమనే పూల నావపై
సరిగమపదనిస అంచులు దాటి
సర్వేశ్వరునీ తలచమన్నదీ
సుఖముగ స్వర్గము చేరమన్నదీ"

– వి.ఎ.కె.రంగారావు

★★★

COMMENTS